క్లుప్తంగా

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ధర్మపతి



మాక్లూర్: బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా ముల్లంగి(బి) గ్రామానికి చెందిన భూలోళ్ల ధర్మపతిని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అడవిమామిడిపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. నాయకులు గంగోని సంతోష్, గోవురు ఒడ్డెన్న, అనిల్ కులకర్ణి, ముప్ప గంగారెడ్డి, చింత ప్రవీణ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని బీజేపీ కమిటీ ఎన్నిక

వర్ని: వర్ని మండల బీజేపీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా రాజేష్, రమేష్ యాదవ్, గడ్డమీది శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా రమేష్ రాథోడ్, తాళ్లూరి ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా గోవూరి సతీష్, ఆశగోని సాయి కుమార్ గౌడ్, కోశాధికారిగా మైదం సాయిలు తోబాటు 35 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు రమేష్ వెల్లడించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు, జిల్లా కౌన్సిల్ మెంబర్ శంకర్ పాల్గొన్నారు.

15న క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 15న క్షత్రియ సమాజ్, యువజన సమాజ్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు సన్మాన కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు సమాజ్ సభ్యులు తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులపైన, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీలో 850 మార్కులు, పాలిసెట్, ఎంసెట్, నీట్, జేఈఈలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు సన్మానానికి అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థుల పేర్లను 13లోపు శ్రీ లక్ష్మీనారాయణ మందిరంలో నమోదు చేసుకోవాలన్నారు.

పాఠశాలల తనిఖీ

పెర్కిట్(ఆర్మూర్): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్, కేజీబీవీ, తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలను తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో బ్రహ్మనందం శుక్రవారం తనిఖీ చేశారు. కిచెన్‌లో ఆహార పదార్థాల నిలువలను పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ.. పట్టణం సుందరంగా ఉండేందుకు పారిశుధ్య కార్మికులే కారణమన్నారు. అలాంటి కార్మికులు ఆరోగ్యంగా ఉంటే పట్టణ ప్రజలు ఆరోగ్యం ఉన్నట్లే అన్నారు. అనంతరం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్, సిబ్బంది ఆనంద్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

రెంజల్(బోధన్): రెంజల్‌లోని శాఖా గ్రంథాలయం నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఏఈకి సూచించారు. త్వరిత గతిన నిర్మాణ పనులను పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. మాజీ జెడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీనివాస్, నాయకులు సాయిబాబాగౌడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. సదరు యువతి గురువారం నిజామాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్ డబ్బులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఇప్పటికీ తిరిగిరాకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

దివ్యాంగులకు అవగాహన కల్పించాలి

ఆర్మూర్‌టౌన్: దివ్యాంగులకు ప్రత్యేక విద్యపై అవగాహన లేదని, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో భార్గవి అన్నారు. ఆర్మూర్ మార్కెట్ యార్డులో శుక్రవారం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులకు బడిబాట నిర్వహించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు ఈ-సహాయ పరికరాలు స్నేహ సొసైటీ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వెటర్నరీ ఆస్పత్రి

- ఊడిపడుతున్న భవనం పైపెచ్చులు
- భయాందోళనలో సిబ్బంది, రైతులు



పెచ్చులూడిన స్లాబ్



రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. రుద్రూర్ సమీప గ్రామాల్లో రైతులకు సంబంధించిన పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి 45 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం పెచ్చులూడి పడుతోంది. నాలుగేళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. వర్షం కురిసినపుడు గోడలు తడిసి ముద్దవుతున్నాయి. మూడు గదులు, ఒక వరండా ఉండగా , ఒక గది పూర్తిగా పనికి రాకుండా తయారైంది. దీంతో పశువులకు వైద్యం చేయించేందుకు వచ్చే రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా పశువులు, మేకలు, గొర్రెలు సుమారు ఐదు వేల వరకు ఉన్నాయి. రైతులు మూగ జీవాలను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకువస్తారు. స్లాబ్ నుంచి పైపెచ్చులూడి పడుతున్నందున లోపలికి రావడానికి వారు జంకుతున్నారు. జీవాలకు చికిత్సచేసే వరకు ఆస్పత్రి ఆవరణలోనే వేచి ఉంటున్నారు. సిబ్బంది సైతం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో నాలుగు పోస్టులు ఉండగా వెటర్నరి అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఆస్పత్రి వెటర్నరీ డాక్టర్ మండలంలోని పశువులకు సీజనల్ వారీగా టీకాలు వేసి చికిత్స అందించడంతో పాటు మరో రెండు గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారిగా అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సమయంలో పశువులను చికిత్స నిమిత్తం తీసుకువచ్చే రైతులు డాక్టర్ కోసం వేచి ఉండాల్సి వస్తోంది. మండల కేంద్రంలో వెటర్నరి ఆస్పత్రి నూతన భవనం నిర్మించి ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్త బిల్డింగ్ కట్టాలి

ఆస్పత్రి భవనం పెచ్చులు ఊడి పడుతున్నాయి. పశువులను ఆస్పత్రికి తెస్తే లోపలికి వెళ్లాలంటే భయం అవుతోంది. ఎప్పుడు పెచ్చు మీద పడుతుందేమోనని. ఆస్పత్రిలో ఉన్నంత సేపు భయం భయంగానే ఉంటది. కొత్త బిల్డింగ్ కట్టాలి. సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

– నారాయణ, పాడి రైతు, రుద్రూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వెటర్నరి భవనం పెచ్చులూడుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించేటప్పుడు జాగ్రత్తగా ఉంటున్నాం. సీజనల్ వారీగా గ్రామాలకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నాం. పని ఎక్కువగా ఉన్నప్పుడు రాయకూర్‌లో ఎల్ఎస్ఏను పిలుస్తున్నాం.

– సంతోష్, వెటర్నరీ డాక్టర్, రుద్రూర్

పాఠశాలకు ఊరు,పేరు లేదా?



పాఠశాల ముందు ఖాళీ బోర్డు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల డొంకేశ్వర్ మండలంలోని తొండాకూర్‌లోనిది. కానీ, దారిన వెళ్తూ చూసే వారికి మాత్రం ఇది ఏంటో తెలియడం లేదు. బోర్డును ఏర్పాటు చేసి దానిపై ఊరు, పాఠశాల పేరు రాయకపోవడంతో చూసినవాళ్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల పునః ప్రారంభం అయ్యేనాటికైనా ఊరు, పేరు రాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి ముందు పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని సాయి ఓకేషనల్ కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుర్తింపు లేని ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రభుత్వం నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేయాలన్నారు. నాయకులు సిద్ధార్థ, అర్వింద్, అంజి, చిన్న పాల్గొన్నారు.

సాగు ఖర్చులు తగ్గించుకోవాలి



మోతెలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త కృష్ణచైతన్య

వేల్పూర్: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుతూ రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రుద్రూరు ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఏ. కృష్ణచైతన్య సూచించారు. మోతెలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, భాస్వరం ఎరువులను పైపాటుగా వేయరాదని, దుక్కిలో మాత్రమే వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయిప్రసాద్, ఏవో శృతి, మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



మంగళ్‌పాడ్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బోధన్: పంటలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు రసాయన మందులను మోతాదుకు మించి వినియోగించకుండా సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ షహనాజ్, కల్పన రైతులకు సూచించారు. శుక్రవారం ఎడపల్లి మండలం మంగల్‌పాడ్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పంటల సాగు పద్ధతులపై రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు, ఏఈవో జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

రాముడి ఆశీర్వాదం ఉండాలి



రెంజల్(బోధన్): శ్రీరాముని ఆశీర్వాదం తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేడుకున్నారు. సాటాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆలయంలో తిరుగుతూ మహిళా భక్తులను పలకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నితిన్ మాట్లాడుతూ.. అడిగిన వెంటనే కాదనకుండా రూ.5 లక్షల విరాళం అందించడం వల్లనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తొండాకూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అప్రాదులో..

డొంకేశ్వర్/మాక్లూర్/వర్ని/రుద్రూర్/రెంజల్/బాల్కొండ:ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం డొంకేశ్వర్,మాక్లూర్,రెంజల్,వర్ని, రుద్రూర్ మండలాల పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగాగ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తూ అధునాతనమైన విద్య అందిస్తున్నామన్నారు. పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

రుద్రూర్: కోటగిరి హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. ఎన్.చరణ్, ఎస్. అంజలి, సీహెచ్.శ్వేత, కె. అన్వేష్, ఎం.ప్రణీత్ కుమార్, ఎం.శ్రావణిలు ఎంపికైన వారిలో ఉన్నారు.

రెంజల్ నుంచి పది మంది..

రెంజల్(బోధన్): రెంజల్ హైస్కూల్‌కు చెందిన పది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికై న వారిలో చిన్నారి, పూజ, ఆస్మాబేగం, సాయితేజ, వినోద్, మనోజ్, గగన్‌కుమార్, హర్షవర్ధన్, సాకేత్, ప్రేమ్‌లు ఎంపికైనట్లు వివరించారు.

ఎడపల్లి నుంచి ఒకరు..

బోధన్: ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని జీ.వెన్నెల ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైంది. ఎంపికైన వారికి ప్రతి ఏడాది రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల స్కాలర్‌షిప్ రూపంలో పొందుతారు. ఎంపికైన వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి

పెర్కిట్/బాల్కొండ/మోర్తాడ్/బోధన్:భూసమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. శుక్రవారం జిల్లాలో పలు చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దరఖాస్తులు స్వీకరించారు. పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సదస్సులను పర్యవేక్షించారు.

బహ్రెయిన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



మోర్తాడ్(బాల్కొండ): బహ్రెయిన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను తెలంగాణ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ప్రతి ఏటా నిర్వహించుకుంటున్నామని వలస కార్మికులు వెల్లడించారు. జానపద గేయాలు, తెలంగాణ గీతం ఆలపించి మిఠాయిలు పంచుకున్నారు. సంఘం సభ్యులు ప్రేమ్ సాగర్, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని పెర్కిట్ మోడల్ పాఠశాలతో పాటు బాలుర సమీకృత వసతి గృహంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గిరిబాబు, ప్రదీప్ కుమార్, గణేష్, సాగర్, నరేందర్, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను శుక్రవాం ఎంఈవో జక్కుల రవికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, డ్రెస్‌లు పంపిణీ చేయాలని ఆయన హెచ్‌ఎంలకు సూచించారు.

ఆలయానికి సామగ్రి వితరణ

నవీపేట: యంచ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయానికి మోక్ష ధర్మ దాన ధార్మిక సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో వీడీసీ ప్రతినిధులకు ప్రసాద పరికరాలతో పాటు ఎలక్ట్రికల్ వస్తువులను శుక్రవారం అందజేశారు. దూప దీప నైవేద్యానికి వినియోగించే పరికరాలను కూడా అందజేశారు. అలాగే మైక్‌సెట్, ఆంప్లిఫ్లయర్‌లను ఇచ్చారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి

రెంజల్(బోధన్): హైందవ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ హిందువుపై ఉందని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి అన్నారు. మండలంలోని సాటాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు శుక్రవారం విద్యారణ్యభారతీ స్వామీ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాణపతిష్ఠ కావించారు. మల్లారం ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్, కందకుర్తి సీతారాం త్యాగి మహారాజ్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు సమకూర్చాలి

మోర్తాడ్: ఎస్సీ వసతి గృహంలో ఉండబోయే విద్యార్థులకు అన్ని రకాల వసతులను సమకూర్చాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

టాక్స్‌లను రద్దు చేయాలని వినతి

నవీపేట: కేబుల్ ఆపరేటర్లపై టాక్స్‌లను వెంటనే రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం మండల ప్రతినిధులు శుక్రవారం ట్రాన్స్‌కో ఏడీఈని కోరారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. డీటీహెచ్‌ల రాకతో జీవనోపాధిని కోల్పోయిన కేబుల్ ఆపరేటర్లపై అదనంగా టాక్స్‌లు విధించడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ప్రతినిధులు తుకారాం, నరేందర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.

కళాశాల కరపత్రాల ఆవిష్కరణ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రచార కరపత్రాలను అధ్యాపకులు ఆవిష్కరించారు. కళాశాలలో అన్ని సబ్జెక్ట్‌లకు అధ్యాపకులు ఉన్నారని, ఉచిత పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. అధ్యాపకులు వైష్ణవి, మధు, రాజ్ కుమార్, గంగాధర్, మహేందర్, వెంకటేష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



మురికి కాల్వలో నరికిన చెట్లు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రాజానగర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో రోడ్డుపై ఉన్న చెట్లను నరికి మురికి కాల్వలో పడేయడంతో మురికి నీరు నిలిచిపోయింది. దీంతో కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి వెంటనే మురికి కాల్వలో పడేసిన చెట్లను తొలగింపజేయాలి.– గడ్డె రవికుమార్, నందిపేట గ్రామం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్: 99636 95349

పానీ పాట్లు



కాకతీయ కాలువలో నీటి కోసం తిప్పలు పడుతున్న రైతులు

బాల్కొండ: వరుణుడు కరుణిస్తాడని అన్నదాతలు పసుపు, మక్క పంటను విత్తుకున్నారు. కాని వర్షాలు కురువక పోవడంతో ఉన్న నీటిని పంటకు అందించటానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా లీకేజీ నీరు వస్తుండటంతో ఆ నీటి కోసం రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. పంపు సెట్లకు నాచు తట్టుకోవడంతో రైతులు తాడు కట్టుకుని లోనికి దిగి తొలగిస్తున్నారు.

బీజేపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: మోదీ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలతో పాటు, మోదీ పరిపాలనా తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం అడవి మామిడిపల్లిలో పార్టీ మండల అధ్యక్షురాలు మదారి మమత ఆధ్వర్యంలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 3 నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ మోదీ నిర్ణయమేనని అన్నారు. భవిష్యత్తులో మోదీ ఈ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, భారతదేశం పేరు వింటేనే ఇతర దేశాలు చేతులు కట్టుకుని నిలబడేలా చేస్తారన్నారు. అనంతరం మొక్కలను నాటారు. బీజేపీ నాయకులు గంగోనే సంతోష్, గోవూరు ఒడ్డెన్న, అనీల్ కులకర్ణి, చింత ప్రవీణ్‌రెడ్డి, కలిగోట గంగాధర్, శివలాల్, డి రమేష్, కొత్తూర్ గంగాధర్, రత్నాకర్, ముప్పా గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అభినందనీయం



మాట్లాడుతున్న సూర్య ప్రకాష్

ఆర్మూర్: పట్టణంలోని హజారి కన్వెన్షన్ హాల్‌లో బుగారపు గురవయ్య కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్(గుంటూరు) వారి సహకారంతో సీఎస్ఐ బధిరుల పాఠశాల ఆధ్వర్యంలో డెవలపింగ్ లిటరసీ స్కిల్స్(రైటింగ్ అండ్ రీడింగ్) అనే అంశంపై మూడు రోజుల ఆఫ్‌లైన్ సీఆర్ఈ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జక్కుల దయానంద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మొదటి రోజు ప్రారంభ కార్యక్రమంలో సీఎస్ఐ బధిరుల పాఠశాల మాజీ హెచ్‌ఎం సూర్య ప్రకాష్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రీహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్సీఐ) నిబంధనలకు అనుగుణంగా శిక్షణనిస్తూ కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రత్యేక ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, బధిరుల పాఠశాల హెచ్‌ఎం శాంతమూర్తి, మేనేజర్ సువర్ణ కిరీటి మాట్లాడారు. ఆడియాలజిస్ట్ నరేష్, స్పీచ్ థెరపిస్ట్ సతీష్, ఉపాధ్యాయుడు నరసింహాస్వామి, ఆర్పీలు సుధ, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, రాజన్న, సురేష్ శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



ఇళ్ల మంజూరు పత్రం అందజేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 2, 7వ వార్డులో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి భూమి పూజ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, పండిత్ పవన్, ఖాందేష్ సంగీత, నర్సారెడ్డి, ఖాందేష్ సత్యం, నాయకులు పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): తల్వేద, బాద్గుణ గ్రామాలలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ బొంకం గంగారెడ్డి, నాయకులు గంగయ్య, గంగారెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో గంగాధర్, కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ శుక్రవారం భూమి పూజ చేశారు. నాయకులు వైస్ మల్లారెడ్డి, ఆమందు సంజీవ్, భాస్కర్, చిరంజీవి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం , కోటయ్య క్యాంప్ గ్రామాల్లో ఇందిర మహిళ నిర్మాణానికి వర్ని ఏఎంసీ అధ్యక్షుడు సురేష్ బాబా శుక్రవారం భూమి పూజ చేశారు. ఎంపీడీవో వెంకటేష్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, వీర్రాజు, సాయిలు పాల్గొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 శ్రీశ్రీశ్రీ రాజావారు-11.45
హౌస్‌ఫుల్-5 (హిందీ)- 2.55, 6.30, 10.00

స్క్రీన్-4 థగ్‌లైఫ్-11.35, 3.00,6.30, 10.00

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	90,002		

– నిజామాబాద్ బిజినెస్